పల్లె రహదారులకు మహర్దశ

- రూ.3కోట్ల వ్యయంతో 61 పనులు మంజూరు
- గ్రామాల వారీగా పనుల గుర్తింపు
- నెల రోజుల్లో పూర్తి చేయాలని నిబంధన

ఇల్లెందురూరల్: రెండేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణ జాతర జరిగింది. పలు గ్రాంట్ల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా నిధులు కేటాయించారు. ఆయా నిధులతో పల్లెల్లో కనిపించిన ప్రతీ మట్టి రోడ్డుపై కాంక్రీట్ పరిచారు. తాజాగా సీసీ రోడ్ల నిర్మాణం కోసం మరోసారి అత్యధికంగా నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం పలు గ్రామాలలో అక్కడక్కడ అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులు తాజా నిధులతో కొంతైనా బాగుపడుతాయని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మరింత ప్రయోజనకరమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3కోట్ల వ్యయంతో 61 పనులు..

స్వరాష్ట్రంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా మంజూరైన నిధులను మండలంలో అభివృద్ధి చెందిన ప్రాంతాలకే కేటాయిస్తూ వచ్చారు.

ఈ విషయంలో ఏజెన్సీ గ్రామాల ప్రజలు పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ ఈసారి అటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని పంచాయతీలకు ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించారు. మంజూరైన రూ.3కోట్ల నిధులు 29 గ్రామపంచాయతీలలో విస్తరించేలా 61 పనులకు కేటాయించారు.

మార్గదర్శకాలు ఇలా..

గ్రామాలలో అంతర్గత రహదారులపై వేసే సీసీ రోడ్లు పదికాలాల పాటు మన్నేలా రోడ్ల నిర్మాణానికి ఇంజనీరింగ్ శాఖ నిబంధనలు కూడా జారీ చేసింది. సీసీ రోడ్డు వేయడానికి ముందు నేలంతా చదును చేసి గట్టిపడేలా రోలింగ్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత 1:1.5:3 నిష్పత్తి అంటే ఒక బొచ్చ సిమెంటు, 1.5 బొచ్చెల ఇసుక, మూడు బొచ్చల కంకర మిశ్రమాన్ని సీసీ రోడ్డుకు వినియోగించాలి. ఈ నిబంధన ప్రకారం రూ.5లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డుకు 56 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించాల్సి ఉంటుంది. మొత్తం కాంక్రీట్‌లో 90శాతం కంకర అంటే మూడు టిప్పర్ల కంకర, 12 ట్రాక్టర్ల ఇసుక, 336 సిమెంటు బస్తాలు వినియోగించాలి. మిశ్రమంలో ఒక బస్తాకు 20 లీటర్ల లెక్కన నీటిని వినియోగించాలి. 12.4 అంగుళాల వెడల్పు, ఏడు అంగులాల మందంతో రోడ్డు ఉండాలి. ఈ రోడ్డుకు 28 రోజులపాటు క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయాలి.



బాలాజీనగర్‌లోని అంతర్గత రోడ్డు

హడావుడి పనులతో తప్పని అనర్థం...

పాతకాలనీలలో ప్రసుత్తం ఉన్న రహదారిని బట్టి బేస్‌మెంట్ ఎత్తును నిర్ణయించి ఇళ్లను నిర్మించుకున్నారు. నూతనంగా సీసీ రోడ్డు వేస్తున్న సమయంలో రహదారికి కొంత తవ్వి రోలింగ్ చేసిన తరువాత సీసీ వేయాల్సి ఉంటుంది. కానీ హడావుడిగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా సీసీ రోడ్లు ఎత్తుగా వేయడం వల్ల చాలా వీధుల్లో ఇంటి యజమానులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలలోని అంతర్గత రహదారులలో వేసే సీసీ రోడ్డు ఎం-20 గ్రేడ్‌తో వేయాల్సి ఉంటుంది. దీనికోసం నిబంధనలకు అనుగుణంగా ఇసుక, కంకర, సిమెంటు మిశమాన్ని వినియోగించాలి. కానీ నిబంధనలకు తిలోదకాలిచ్చి పనులు మమ అనిపిస్తున్నారు. కాంక్రీట్‌ను పటిష్టపర్చేందుకు చేపట్టే క్యూరింగ్ విషయంలో కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 28 రోజులపాటు క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ సీసీ రోడ్డుపై మట్టికట్టలు కట్టి కేవలం రెండు, మూడు రోజులు నీటిని పోసి మమ అనిపిస్తున్నారు. ఫలితంగా ఇప్పటి వరకు పరిచిన సీసీ రోడ్లు ఏడాది గడవకముందే కంకర తేలి కనిపిస్తున్నాయి. ఈసారి అయినా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నెలాఖరు నాటికి పూర్తిచేయాలి..

ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా మంజూరైన పనులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రస్తుతం మంజూరైన పనులు మార్చి 28 నాటికి పూర్తి చేసి ఆన్‌లైన్ చేస్తేనే త్వరితగతిన బిల్లులు మంజూరవుతాయి. ఆలస్యమైతే బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం తప్పదు. గతానుభావాల దృష్ట్యా ఈ దఫా సకాలంలో పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు చెపుతున్నారు.

నాణ్యతగా పనులు చేయిస్తాం..



సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. మిశ్రమం సమపాళ్లలో ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తాం. 28 రోజులు క్యూరింగ్ చేసేలా జాగ్రత్తలు పాటిస్తాం. నాణ్యత విభాగం సిఫారసుల మేరకే బిల్లులు మంజూరు చేస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు

క్లుప్తంగా

విశ్వామిత్రకు కలెక్టర్ అభినందన



చౌహాన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

చుంచుపల్లి: ప్రతీరోజు మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న చుంచుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విశ్వామిత్ర చౌహాన్ శనివారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలవగా అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంలో ఆదర్శంగా నిలుస్తూ పలు అవార్డులు తేవడం గర్వకారణం అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మొక్కలు నాటడాన్ని చిన్నతనం నుంచే అలవాటు చేయాలన్నారు. అందరూ పర్యావరణ పరిర క్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హామీలను అమలు చేయండి..



మాట్లాడుతున్న మంజూరు, రాజుగౌడ్

పాల్వంచ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ మంజూరు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీస్ వద్ద.. ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని పోస్ట్‌కార్డ్ ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5లక్షలు, రూ.25వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎండీ మసూద్, దేవులాల్ నాయక్, ఇజ్జగాని రవిగౌడ్, బొల్లం భాస్కర్, కేసుపాక ముత్తయ్య, కట్టా ఐలయ్య, కేసరి రవీందర్, అఖిల్, గణేష్, పూనెం నాగేశ్వరరావు, రాములు, బాషా, లక్ష్మణ్, ఎండీ ఆదిల్, దేవరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

పాల్వంచ: వాహనాలు తనిఖీ చేసి పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరిపై, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న ఐదుగురిపై, నంబర్ ప్లేట్లు లేని 10 వాహనాలకు జరిమానా విధించారు.

విచారణ జరపండి..

పాల్వంచరూరల్: బంద్రుగొండ గ్రామపంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కూలీలు నర్సింహారావు ప్రజావేదికలో డీఆర్‌డీఓకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ లైన్‌మెన్లను నియమించండి..

పాల్వంచరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్‌మెన్లు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెంటనే ఖాళీగా ఉన్న లైన్‌మెన్ల పోస్టులను నియమించాలని కోరుతూ ఎన్పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్‌కు శనివారం స్థానికులు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... పాండురంగాపురం, జగన్నాథపురం గ్రామాల్లో లైన్‌మెన్లు లేక గాలివాన వచ్చినప్పుడు, చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే పునరుద్ధరణ చేసేవారు లేక రైతులు, వినియోగదారులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వెంటనే లైన్‌మెన్లు నియమించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బరపటి వాసుదేవరావు, కొండం వెంకన్న, ధర్మపురి ప్రసాద్, బాలాజీ ఉన్నారు.



ఏఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న రవి

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినా, రిజిస్టర్లు సక్రమంగా లేకున్నా సిబ్బందికి జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని ఆదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి పథకం కింద 2023–2024 పనుల 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక (ఇన్‌హౌజ్) నిర్వహించారు. రూ.7.35 కోట్ల విలువగల 779 పనుల నివేదికలను సామాజిక తనిఖీ బృందం అధికారులకు అందజేశారు. అటవీశాఖ ద్వారా రూ.22.45లక్షల వ్యయంతో నాలుగు పనులు నిర్వహించగా.. రెండు పనుల రికార్డులను మాత్రమే అందజేశారు.

పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2.51 కోట్ల విలువగల 77 పనులు, మన ఊరు – మనబడి కింద రూ.27.08 లక్షల పనుల రికార్డులను అందజేయలేదు. అవకతవకలపై 122మంది సోకాజ్ నోటీసులు ఇచ్చారు. పలువురి సిబ్బందిపై జరిమానా విధించి రికవరీలు చేశారు.

తునికాకు టెండర్లు నిర్వహించండి..

పాల్వంచ: తునికాకు సేకరణకు ప్రభుత్వం వెంటనే టెండర్లు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు కోరారు. శనివారం గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడారు. ఎస్‌కె.ఉమర్, వెంకటేశ్వర్లు, రాంబాబు, రెడ్డి, రాఘవులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: తునికాకు 50 ఆకుల కట్టకు రూ.6 చొప్పున చెల్లించి ప్రూనింగ్ పనులను వెంటనే నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం సబ్ డివిజన్ కమిటీ సభ్యురాలు వీరమల్లు ఉమ డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం గ్రామంలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం కళ్లెం కలింగరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఏజెన్సీలో తునికాకు సేకరణ ఆదివాసీ గిరిజన, గిరజనేతరులకు జీవనోపాధి అన్నారు. జ్యోతి, రజిత, అరుణ, గంగమ్మ, సులోచన, సుజాత పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సొంతింటి కల నెరవేర్చండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు చిరకాల వాంఛ సొంతింటి కలను నెరవేర్చాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌తో కలిసి సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ త్వరలో వీటిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చర్యలు తీసుకోండి..

జూలూరుపాడు: విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులను నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పెరుమాళ్ల పవన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులపై బెదిరింపులకు పాలప్పడుతున్న హరిశంకర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివమణి, అనిల్, గణేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

9న అయిలయ్య సంస్మరణ సభ

సింగరేణి(కొత్తగూడెం): మార్చి 9న సీపీఎం రాష్ట్ర నేత కాసాని ఐలయ్య సంస్మరణ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక మంచికంటి భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశ ంలో ఆయన మాట్లాడారు. కాసాని నిరంతరం ప్రజల కోసం పరితపించిన వ్యక్తి అని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారని చెప్పారు. ఈ సభకు అన్నివర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఫ్రీజర్ వితరణ

టేకులపల్లి: బోడు గ్రామానికి చెందిన సల్లూరి నర్సయ్య – లక్ష్మమ్మ దంపతులు, సల్లూరి కేశవుల జ్ఞాపకార్థం వారి మనుమలు ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేశారు. ఈ మేరకు శనివారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌కి మార్చురీ ఫ్రీజర్‌ను అందజేశారు. ఈ బాక్స్ వల్ల బోడు పోలీసుస్టేషన్ పరిధిలోని బోడు, కొప్పురాయి, గంగారం, రామచంద్రునిపేట, లచ్చగూడెం పంచాయతీల్లోని 44 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, బాక్స్ కావాల్సిన వారు బోడు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని దాతలు కోరారు.

అమరవీరులకు నివాళి

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు మరిచిపోలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న అన్నారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టేకులపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జినక ఇస్తారి, పోలెపొంగు లక్ష్మణ్ గుగ్గిళ్ల వెంకన్న, కుక్కమూడి శంకర్, పాటిబండ్ల ప్రసాద్, బండారి శీను, చినుక శ్రీకాంత్, సావిత్రి, బోడ మంచ, ఇస్లావత్ చందా, ఇస్లావత్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై కఠిన చర్యలు

టేకులపల్లి: బోడు రోడ్డు సెంటర్‌లో డ్రెయినేజీలు, పార్కింగ్ స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి సెంటర్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగించాలన్నారు. వాహనాలను రోడ్డుపై నిలిపితే జరిమానా విధిస్తామన్నారు.

సింగరేణి డైరెక్టర్‌కు అభినందనల వెల్లువ



సూర్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్‌గా నియమితులైన ఎల్వీ సూర్యనారాయణను శనివారం బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు కూసన వీరభద్రయ్య, బీసీ కులసంఘాల నాయకులు, వివిధ యూనియన్ నాయకులు వేర్వేరుగా డైరెక్టర్ చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో ఎంజీటీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అంకితభావంతో విధులు నిర్వహించి అంచెలంచెలుగా ఎదిగారని, భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు కార్మికుల, రక్షణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకొని సంస్థ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోఎస్‌బీ సీఐ శ్రీనివాస్‌రావు, వివిధ యూనియన్లు, కార్మిక సంఘాలు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు కొత్తగూడెంలో జిల్లా మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం జరగనున్న తెలంగాణ రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం మండల కార్యదర్శి సిలివేరి నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జూలూరుపాడులో కరపత్రాలను ఆవిష్కరించారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న పింఛన్, పిల్లలకు స్కాలర్‌షిప్, సొంతిల్లు వంటి పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యే జిల్లా మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుడిమెట్ల సీతయ్య, ఎస్కే కరీముల్లా, నరసింహారావు, వెంకటేశ్వర్లు, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ బాసిత్

కొత్తగూడెంఅర్బన్: తాటిపల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం కూలీలైన్ సరస్వతి శిశు మందిరంలోని వందమంది విద్యార్థులకు రూ.లక్ష రూపాయల విలువైన దుస్తుల పంపిణీ చేశారు. మోడ్రన్ ఇక్రా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్, ట్రస్ట్ కార్యదర్శి తాటిపల్లి రోహిత్, పిల్లి రాజేశ్వరరావు, నాగభూషణం, స్కూల్ ప్రిన్సిపాల్ స్రవంతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటీపీఎస్ కాలనీలో పెట్రోలింగ్ పెంచండి..



మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ కాలనీల్లో దొంగతనాలు పెరుగుతున్నాయని, పెట్రోలింగ్ పెంచాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ కోరారు. శనివారం కేటీపీఎస్ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడారు. కాలనీల్లో దొంగతనాలు, ఆకతాయిలు తిరుగుతున్నారని, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. స్పందించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. స్పెషల్ పార్టీ సిబ్బందితో నిఘా పెంచి, పెట్రోలింగ్ పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేటీపీఎస్ 5, 6, 7 దశల రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు దంచాల రాంబాబు, ముత్యాల రాంబాబు, కె.రవికుమార్, ఆర్.శ్రీనివాస్, డి.నాగేశ్వరరావు, బి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

జూలూరుపాడు: పడమటనర్సాపురం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం సమీపంలో శనివారం రాత్రి బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఒకరికి గాయాలయ్యాయి. మాచినేనిపేట గ్రామ పంచాయతీ గోపాతండాకు చెందిన భూక్యా హత్తీరామ్ తన బైక్‌పై సురారం వెళ్తున్న ఈ క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

సింగరేణి గనులు, కార్మికుల రక్షణే లక్ష్యం



సింగరేణి(కొత్తగూడెం): మ్యాప్‌లో గని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తివారి



ఇల్లెందు: మ్యాప్ ఆధారంగా బొగ్గు తవ్వకం పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం రీజియన్ పరిధిలోని 9 గనులు (2 భూగర్భ, 7 ఓపెన్‌కాస్టులు) లలో పనిచేసే కార్మికులు, ఆయా గనుల రక్షణే తన లక్ష్యమని, సింగరేణి యాజమాన్యం గనుల్లో ఎలాంటి ప్రమాదాలు, సంఘటనలు జరగకుండా చూసేందుకు తనకు రీజియన్ బాధ్యతలు అప్పగించిందని రీజియన్ సేఫ్టీ జీఎం తివారి పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 గనిని ఆయన ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరావుతో చర్చించారు.

ఈ సందర్భంగా గని ప్రాంతాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెంలో పీవీకే – 5 చాలా పెద్ద గని అని ఈ గనిలో గతంలో జియాలాజికల్ సమస్యలు వచ్చేవని, అదేవిధంగా వెంటీలేషన్ సమస్య ఉండేదని, ప్రస్తుతం ఆ ఇబ్బంది లేదన్నారు. అందుకోసం తాను ప్రతీరోజు గని మేనేజర్, ఏజెంట్, గని సేఫ్టీ ఆఫీసర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌తో మానిటరింగ్ చేసి సమస్యలుంటే చర్చించి నివారణ చర్యలు చేపడతామన్నారు. అంతేకాకుండా ఏరియాలలో సీఎస్‌పీ, వర్క్‌షాపులు, ఎంవీటీసీలను కూడా పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటాన్నామన్నారు.

లక్ష్యాన్ని సాధిస్తాం..

కొత్తగూడెం ఏరియాకు యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరంలో 149.450 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ వీకే–7 గనికి 10 లక్షల టన్నుల అని, అయితే వీకే–7కు అనుమతులు రానందున, 139.50 లక్షల టన్నుల లక్ష్యం అని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి వరకు 126.65 లక్షల టన్నులు సాధించగా, మిగిలిన లక్ష్యం సుమారు 17 లక్షలు రానున్న 30 రోజుల్లో సాధిస్తామని తెలిపారు.

ఏరియాలో డైరెక్టర్ పర్యటన

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. శనివారం జేకే–5 ఓసీ, కేఓసీ, సీహెచ్‌పీలో పని స్థలాలను పరిశీలించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, రవాణా వివరాలను ఏరియా జీఎం వి.కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంట్ జీఎం సైదులు, జీఎం ఎస్టేట్ రాధాకృష్ణన్, ఎస్ఓటూ జీఎం రామస్వామి, పీఓ కేఓసీ గోవిందరావు, జేకే ఓసీ ప్రాజెక్టు కృష్ణమోహన్ రావు, మేనేజర్ పూర్ణచందర్, సౌరభ్ సుమన్, క్వాలిటీ మేనేజర్ రామదాస్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి వివరాలు..

సింగరేణి ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి వివరాలను జీఎం వి.కృష్ణయ్య శనివారం వెల్లడించారు. 2025 ఫిబ్రవరి నెల లక్ష్యం 5.12 లక్షల టన్నులు కాగా, 2.61 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. 1.30 లక్షల టన్నులు రైలు మార్గం ద్వారా 0.48 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా రవాణా చేసినట్లు చెప్పారు. ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 0.87 ఇల్లెందు ఏరియాలో మొత్తం 2.66 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు.